క్లుప్తంగా

బాట సుంకులమ్మ అమ్మవారికి పూజలు


అలంకరణలో అమ్మవారు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి సమీపంలో గురువారం బాట సుంకులమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించే తిరునాల గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. భూమిరెడ్డి ఫార్మర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఊబిచెర్లలో ఎమ్మెల్యే ప్రచారం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో శుక్రవారం నుంచి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి గురువారం తెలిపారు. ముందుగా బాచుపల్లి గ్రామంలోని బాట సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలో ప్రచారం ప్రారంభిస్తారన్నారు. ఉదయం 8.30 గంటలకు బాచుపల్లి బాట సుంకులమ్మ ఆలయం దగ్గరకు జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

నవమి వేడుకలు ప్రారంభం


సీతారాములు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండుగ రెండు రోజుల తరువాత నవమి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఆర్వీస్వామి కల్యాణమండపం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గురువారం రాత్రి శ్రీరామచంద్రుడు కోదండ రామస్వామి అలంకరణలో కొలువుతీరాడు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భద్రచలంలో సీతారాముల కల్యాణోత్సవం రోజు ఇక్కడ కూడా స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

17న సీతారాముల కల్యాణం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆర్ఎస్ అగ్రహారం సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న సీతారాముల కళ్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఆలయంలో మంగళవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 11 గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాత్రికి కీలు గుర్రాలు, చెక్కభజనతో స్వామి ఉత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు వాహనాల వేలం

గుత్తి: పట్టణంలోని సెబ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవా రం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ శివ సాగర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తామన్నారు.ఆసక్తిఉన్నవారు రూ.3,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా మేరి



గుంతకల్లుటౌన్: సంచార జాతుల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పట్టణంలోని దోనిముక్కల ఏరియాకు చెందిన చప్పిడి మేరీని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్‌జావిద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంచారజాతుల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని ఆయన సూచించారు.

పరామర్శ


రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో గురువారం రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. బుధవారం గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన కారు–ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో రామసుబ్బారెడ్డి కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డి మృతి సంగతి తెలిసిందే. మృతదేహాలను స్వగ్రామం తీసుకురావడంతో ఎమ్మెల్యే వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, శివారెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాల్లో ముస్లింల సామూహిక ప్రార్థనలు
- అల్లా మార్గంలో నడవాలని ఖాజీలు, ఇమాంలు, మతపెద్దల సందేశం

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల సాక్షిబృందం: పవిత్రమైన, ప్రేమ, మానవత్వాల సమ్మేళనమైన రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం ముస్లింలతో ఈద్గా మైదానాలు, మసీదులు నిండిపోయాయి. ప్రభుత్వ ఖాజీలు, మత పెద్దలు అల్లాహ్ సందేశాన్ని వినిపించారు. విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పశుపక్షాదులకు ఆహారం బాగా లభించి ప్రతి ఒక్కరూ సుఖ, సంతోషాలతో ఉండాలని ఇమాంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడిచి ఆయన చూపిన భక్తిమార్గం అనుసరించాలన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అలాగే ముస్లింలు పేదలకు దానం చేశారు. ఈ సందర్భంగా మసీదులను ప్రత్యేకంగా అలంకరించారు. కాగా గుంతకల్లు, తాడిపత్రిలో ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈద్గా మైదానాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలకు శభాకాంక్షలు తెలిపారు. అలాగే తాడిపత్రిలో ఎమ్మెల్యే కుమారులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మత గురువులు, అంజుమన్ కమిటీ పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.


పాత గుంతకల్లు ఈద్గా మైదానంలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్, మైనార్టీ నాయకులు


గుత్తి ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు


గుత్తి రూరల్: కొత్తపేట ఈద్గా మైదానంలో..


పామిడిలో ఈద్గా వద్ద ...


పెద్దవడుగూరులో..


యాడికిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిలు


పెద్దపప్పూరులో ..


గార్లదిన్నె మండలం మర్తాడులో..


బుక్కరాయసముద్రంలో ..


తాడిపత్రిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి


తాడిపత్రిలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి


తాడిపత్రిలో ఫయాజ్ ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు


యల్లనూరు ఈద్గా వద్ద చిన్నారుల శుభాకాంక్షలు


నార్పలలో..

పశువు కంటే హీనం జేసీ ప్రభాకర్

- ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని చంపుకుని పశువు కంటే హీనంగా ప్రవర్తిస్తున్నాడని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎద్దేవా చేశారు. రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు ముస్లింలు స్వీట్లు తినిపించి శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని చంపుకుని బతుకుతున్నాడన్నారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు చేశాడని, అధికారం కోల్పోయిన తరువాత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నీచ రాజకీయాలు చేస్తున్న నీ గురించి అందరి కంటే నాకు బాగా తెలుసన్నారు. నీవు మంచిగా ఉంటే గౌరవించడంతోపాటు రాజకీయం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. 420 నాయకుల మాటలు నమ్మి చేస్తున్న రాజకీయాలు నీ దిగజారుడుకు అద్దం పడుతోందన్నారు. ఇలాంటి రాజకీయాలు చేస్తున్న నీకు ప్రజలు కూడా గౌరవం ఇవ్వరన్నారు. తనలో మార్పు వచ్చిందని అందరినీ నమ్మించే ప్రయత్నం చేస్తున్న జేసీకి.. మార్పు ఏమిటో మే 13న పోలింగ్ తరువాత తెలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లింల అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ముస్లింలకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. పార్టీకి ముస్లింల అండ ఉందన్నారు. వలంటీర్ల రాజీనామాలపై చేస్తున్న ఆరోపణలు అసత్యమన్నారు. రాజీనామాలు చేసిన వలంటీర్లు వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తున్నారని, వారందరికి ధన్యవాదాలన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లింలు. (ఇన్‌సెట్లో) వేముల సుదర్శన్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ఎమ్మెల్యే పెద్దారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

తాడిపత్రి పట్టణంలోని నందలపాడులోని బలిజ సామాజిక వర్గానికి చెందిన వేముల సుదర్శన్ నారాయణ గురువారం రాత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీలో చేరానని ఆయన తెలిపారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయండి


పీ కొండాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


పామిడిలోని ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం మండలంలోని పీ కొండాపురం, పీ కొత్తపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల్లో అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ఎమ్మెల్యే ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై ముఖాముఖి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తేవాలన్నారు. సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తెస్తే గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. పేకాట దందా, వసూళ్ల పర్వంతో ప్రశాంతంగా ఉన్న గుంతకల్లు నియోజకవర్గంలో అలజడి సృష్టించేందుకు వచ్చిన స్థానికేతర దుష్టశక్తులైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవ రెడ్డి, నాయకులు సునీల్‌రెడ్డి, అనిమిరెడ్డి, మునగల రంగనాయకులు, పెద్ద వెంకటరాముడు, అనిల్‌కుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే జనరంజక పాలన

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి స్థానిక వాసవీమాత ఆలయంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో అన్నివర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్యాకేజీ దత్తపుత్రుడు పవన్, బీజేపీ నాయకుల స్వార్థ రాజకీయాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పార్టీ ముఖ్య నాయకులతో పాటుభోగేశ్వరాలయ కమిటీ ప్రెసిడెంట్ ఎస్ మురళీధర్‌గుప్తా, ఆర్యవైశ్యులు రత్నమయ్య, ఉపేంద్ర, పీఆర్‌కే బాబు, విజయభాస్కర్, వెంకటగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయులుకు గ్రామాల్లో నీరాజనం




పెరవలిలో ప్రచారం నిర్వహిస్తున్న వీరాంజనేయులు, లిఖిత, పైలా నరసింహయ్య. వీరా, సాంబకు ఎస్సీ కాలనీలో స్వాగతం పలుకుతున్న యువకులు

శింగనమల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుకు పల్లెల్లో మహిళలు, ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. గురువారం మండలంలోని పెరవలి గ్రామంలో మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీకి ప్రాబల్యం ఉన్న గ్రామమైనా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గ్రామంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు పూల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో దిగిన ఎమ్మెల్యే అభ్యర్థి, ఆలూరు ఫోటోతో స్వాగతం పలికారు. అనంతరం ఏడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీనియర్ నాయకులు పామిడి వీరాంజనేయులుతో కలసి వారు ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌కు గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. పెద్దజలాలపురం, జూలాకాల్వ, అలంకరాయునిపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. కొరివిపల్లిలో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రచారం అనంతరం రాత్రికి అక్కడే పల్లె నిద్ర చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లను చంద్రబాబు ఒకప్పుడు కించపరిచారని, నేడు కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, మైనింగ్ డైరెక్టర్ జయసుధ, పార్టీ మండల కన్వీనర్ బాలక్రిష్ణ, వైస్ ఎంపీపీ నరసింహులు, నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణ స్వామి, వీరనారాయణ, రామాంజనేయులు, సర్పంచ్‌లు రాజమొహన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి బండి లలిత కళ్యాణి, రామచంద్ర, వెంకటనారాయణ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మన ఊరికి మన వీరా'

యల్లనూరు: మండలంలోని కోడిమూర్తి, చిలకూరు, అచ్యుతాపురం, బొప్పేపల్లి, వాసాపురం, కూచివారిపల్లి గ్రామాల్లో శుక్రవారం శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రచారం చేస్తారని పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రచారం ముగిశాక వాసాపురం గ్రామంలో వీరాంజనేయులు పల్లెనిద్ర చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, పార్టీ మండల కన్వీనరు, కోఆప్షన్ మెంబరు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

పూలే ఆశయాల సాధనే లక్ష్యం


గుంతకల్లులో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్


పామిడిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/పామిడి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే వైవీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే స్ఫూర్తితో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి జగనన్న చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఆయా వర్గాలు అన్నిరంగాల్లో ప్రగతి సాధించాలంటే మళ్లీ జగనన్నే రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజి, నాయకులు మార్కెట్ వెంకటేష్, తిక్కస్వామి, శ్రీధర్‌రెడ్డి, వసంత్, బావన్న, హాజీ, ముని తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలో వైఎస్సార్‌సీపీ, దళిత, బీసీ వర్గాల ఆధర్వంలో పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకుందాం

తాడిపత్రిటౌన్: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకుందామని సెబ్ అదనపు ఎస్పీ రామక్రిష్ణ, డీఎస్పీ గంగయ్య అన్నారు. మండలంలోని వీరాపురం గ్రామంలో గురువారం ఎన్నికల అధికారులు, సెబ్ అధికారులు, కేంద్ర బలగాలతో పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్వో రాంభూపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లి, ముచ్చుకోట, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు, గార్లదిన్నెలోని ప్రధాన కూడళ్లలో గురువారం ఎస్ఐ శరత్‌చంద్ర వాహనాల తనిఖీ చేపట్టారు. మండల వ్యాప్తంగా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అధిక మొత్తంలో డబ్బులు దొరికినా, మద్యం అక్రమంగా రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఎస్సీ,ఎస్టీ, సంఘాల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం గార్లదిన్నెలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాలు, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడన్నారు.యువత అంబేడ్కర్‌లోని నాయకత్వ లక్షణాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండలంలోని పెనకచెర్లలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాలెం కిషోర్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. యల్లనూరు మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన అతడి నుంచి 250 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆటో, బైక్ ఢీ – ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం ఆటో–బైక్ ఢీకొని సంగప్ప అనే వ్యక్తి గాయపడ్డాడు. తాడిపత్రి రోడ్డు కాలనీలో నివాసముండే సంగప్ప బైక్‌లో గాంధీ సర్కిల్ వైపు వెళుతుండగా ఎదురుగా ఆటో ఢీకొంది. గాయపడిన సంగప్పను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యం పట్టివేత

పామిడి: పట్టణంలో గురువారం రాత్రి సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు, పోలీసులు అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ సుంకప్ప(అనుంపల్లి), రవి (కదిరిపల్లి), వన్నూరప్ప(పామిడి)తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.